## పీవీ కాలనీలో చోరీ



విచారణ నిర్వహిస్తున్న పోలీసులు

మణుగూరు టౌన్, మే 24: మణుగూరు పీవీ కాలనీలో శుక్రవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. పీవీ కాలనీలోని ఎంసీ 183, 190, 195, 175 క్వార్టర్లలో చోరీలు జరగడంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాలనీ వాసుల పోలీసులకు అందించిన సమాచారం మేరకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మేడా ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌తో ఆ ప్రాంతంలో తనిఖీలు చేయించారు.

## క్షయ నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి



న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుండాల, మే 24: క్షయ వ్యాధి అంతానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని గుండాల వైద్యాధికారి డాక్టర్ మనీష్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య కేంద్రంలో గ్రాన్యూల్ స్వచ్ఛంద సంస్థ వారు అక్షయ పాత్ర కార్యక్రమం నిర్వహించి 15 మంది బాధితులకు ఒక్కొక్కరికి 5 కిట్ల చొప్పున స్వతహాగా సుమారు 75 కిట్లు పంపిణీ చేశారు. క్షయ అంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఇల్లెందు డివిజన్ క్షయ యూనిట్ అధికారి శంకర్, హెల్త్ అసిస్టెంట్ బిక్ష్య నాయక్, ఏఎన్ఎమ్ అరుణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ వేయడం అవివేకం

### బీఆర్ఎస్ లీగల్ అడ్వయిజర్ కొత్తా మల్లేశ్వరరావు

దుమ్ముగూడెం, మే 24: సుప్రీంకోర్టు న్యాయమూర్తులే సాక్షాత్తు అవినీతి జరగలేదని, అంతా సవ్యంగానే ఉందని చెప్పినా ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ వేయడం వారి అవివేకానికి నిదర్శనమని బీఆర్ఎస్ లీగల్ అడ్వైజర్ కొత్తా మల్లేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన వాగ్దానలు అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను దేశానికే ధాన్యాగారంగా నిలిచేలా చేసిన ప్రపంచంలోనే అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు కాళేశ్వరాన్ని నిర్మించి తెలంగాణలో సస్యశ్యామలంగా తీర్చిదిద్దిన కేసీఆర్‌పై కమిషన్ల పేరుతో అభాసుపాలు చేయాలని చూస్తే ప్రభుత్వమే ప్రజలముందు దోషిగా నిలబడే రోజులు వస్తాయన్నారు.

## ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు



కందకాలు తీయిస్తున్న రెవెన్యూ అధికారులు

బూర్గంపహాడ్, మే 24: బూర్గంపహాడ్ మండలంలో అక్రమ ఇసుక రవాణాను నియంత్రించేందుకు రెవెన్యూ అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని సారపాక బ్రిడ్జి కింద, నాగినేనిప్రోలు రెడ్డి పాలెం గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు తహసీల్దార్ శిరీష ఆదేశాల మేరకు డీటీ రాంనరేష్, ఆర్ఐలు నర్సింహారావు, నాగేశ్వరరావు, సిబ్బంది ఆయా ప్రాంతాల్లో కందకాలు తీయించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేసినా కందకాలు పూడ్చాలని చూసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పంజాబ్ నేషనల్ బ్యాంక్ శాఖ ప్రారంభం



బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న సింగరేణి సీఎండీ

కొత్తగూడెం సింగరేణి, మే 24: కొత్తగూడెంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మొదటి బ్రాంచ్‌ను సింగరేణి సీఎండీ బలరాం శనివారం ప్రారంభించారు. బ్యాంక్ డిప్యూటీ జీఎం, సికింద్రాబాద్ సర్కిల్ హెడ్ సుజిత్ కుమార్ ఝూ, సింగరేణి జీఎం (పర్సనల్) కిరణ్‌కుమార్, జీఎం (సెక్యూరిటీ) లక్ష్మీనారాయణ, ఏజీఎం (పర్సనల్) రాజేంద్రప్రసాద్, డీజీఎం (పర్సనల్) ముకుంద సత్యనారాయణ, డీవైపీఎం సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
Classifieds

WANTED

★Staff for reputed Homeopathy Clinic, Khammam. Homeopathy Doctors (BHMS/MD) -2, Receptionist (any Degree)-2, Manager-1, Cont: 9502755595
KMM-

కావలెను

★ప్రముఖ కంపెనీ నందు రిసెప్షనిస్ట్‌గా పని చేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ కలిగిన మహిళలు కావలెను. సంప్రదించవలసిన నెంబర్లు : 9640231009, 9985953170
KMM-

అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

WANTED

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

FINANCE


★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు



సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

# అటవీ సంపదే ఆధారం

### అటవీ ఉత్పత్తులను సేకరిస్తున్న గిరిజనులు

### మంచి ఆదాయం గడిస్తున్న వైనం

పర్ణశాల, మే 24: దట్టమైన అటవీప్రాంతం కలిగిన దుమ్ముగూడెం.. ఏజెన్సీలోనే అతిపెద్ద మండలం. దీనికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సరిహద్దుగా ఉండి అటవీప్రాంతం ఎక్కువగా ఉంది. ఈ అటవీ ప్రాంతంలో అటవీ ఉత్పత్తులైన తునికాకు, తునికి పండ్లు, విప్పపువ్వు, ఈతకాయలు, సీతాఫలాలు, జిగురు, తేనె లాంటి వాటిని కాలానుపరంగా గిరిజనులు సేకరిస్తున్నారు. వాటిని బయట ప్రాంతాల్లో విక్రయించి ఆదాయంగా మార్చుకొని జీవనం సాగిస్తూ ఉన్నారు. ఏజెన్సీలో గిరిజనులు వర్షాకాలం, సీతాకాలంలో తమ పంటపొలాల పనులు పూర్తి అవ్వడంతో మిగతా సమయంలో అడవిలో దొరికే పండ్లను సేకరించి ఆదాయం పొందుతున్నారు. అడవి పండ్లను సేకరించడంలో గిరిజనుల మహిళలు ఎక్కువగా ముందుంటారు. అడవుల్లో సేకరించిన విప్పపువ్వు, విప్పబద్దలు, జిగురు, చింతగింజలు కిలో రూ.50 నుంచి రూ.80 వరకు గిరిజన సహకార సంస్థలకు విక్రయిస్తారు. అలా ఆరునెలలపాటు అటవీ ఫలాలను విక్రయించడం ద్వారా వచ్చే సొమ్మును వారి కుటుంబ అవసరాలకు ఉపయోగిస్తారు. గిరిజన కుటుంబాల్లో పురాతన కాలం నుంచి మగవారు వ్యవసాయ పనులు చేయడం, గిరిజన మహిళలు వారికి సహాయం చేస్తూ ఖాళీ సమయాల్లో మహిళలు గుంపులుగా అడవులకు వెళ్లడం ఆనవాయితీ. అటవీ ఫలాలను సేకరించి వాటిని విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని కుటుంబ జీవనానికి ఉపయోగిస్తారు. ఇది గిరిజన తెగలో ఒక భాగం అని గిరిజన మహిళలు చెబుతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతాల్లో అడవి జంతువులు, విషసర్పాల బారినపడి గిరిజనులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకమున్నాయి. అయినా అడవులకు వెళ్లి అక్కడ దొరికే వాటిని సేకరించడం వీరికి ఎంతో మక్కువ. ఊహ తెలిసిన పిల్లల నుంచి 70ఏండ్ల వృద్ధుల దాకా అడవికి వెళ్తుంటారు.



తునికాకు, తునికిపండ్లు, విప్పపువ్వు, ఈతకాయలు విక్రయిస్తున్న గిరిజన మహిళ



విప్పబద్దలు తీస్తున్న గిరిజన మహిళ

### అటవీ సంపదపైనే ఆధారం



శీతాకాలం, వేసవికాలం అడవుల్లో దొరికే కుంకుడు, విప్పపువ్వు, విప్పబద్దలు, సీతాఫలాలు, తేనె, మద్ది జిగురు, తునికి పండ్లు మాకు ఆధారం. మహిళలం గుంపులుగా వెళ్లి వాటిని సేకరించి విక్రయిస్తాం. వాటిద్వారా వచ్చిన ఆదాయం మా కుటుంబ పోషణకు ఉపయోగపడుతుంది. పురాతనకాలం నుంచి గిరిజన తెగల్లో అటవీఫలాలు సేకరించి వాటిద్వారా వచ్చిన ఆదాయాన్ని ఖర్చు పెట్టడం మా సంప్రదాయం.

– సరోజిని, పెద్దబండ్రేవు

### అటవీ ఫలాల సేకరణే ఇష్టం



మేము ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాల్లో ఉంటాం. అడవులకు వెళ్లి అటవీఫలాలు సేకరించడం మాకు ఎంతో ఇష్టం. విప్పపువ్వులు, విప్పబద్దలు, జిరుగు, చింతగింజలు, దుంపలు సేకరించి గిరిజన స్టోర్‌ల వద్ద వాటిని విక్రయిస్తాం. ఇలా ప్రతి ఏడాది ఆరునెలలపాటు అడవిలోకి వెళ్లి అక్కడ దొరికే ఫలాలను సేకరించి వాటిని బయట గ్రామాల్లో అమ్ముకుంటాం. ఒక్కోసారి ప్రాణహాని కూడా కల్గుతుంది.

– ధారమ్మ, ములకనాపల్లి

# ఎట్టకేలకు బీటీ రోడ్డు వేశారు..

### 'నమస్తే' కథనానికి స్పందన



బీటీ వేసిన కల్వలనాగారం- కన్నాయిగూడెం రహదారి

కరకగూడెం, మే 24: కంకర వేశారు.. బీటీ మరిచారు.. అనే శీర్షిక ఇటీవల ' నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని కల్వలనాగారం నుంచి కన్నాయిగూడెం గ్రామాన్ని కలుపుతూ బీటీ రోడ్డు నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. కంకర పోసి ఏడాదిన్నర గడిచినా బీటీ వేయకుండా బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ చెప్పుకుంటూ వచ్చాడు. బీటీ రహదారి వేయకపోవడంతో రోడ్డు అంతా ప్రమాదభరితంగా మారింది. దీంతో పాటు ఈ రహదారి ప్రమాదాలకు నెలవుగా మారాయని ' నమస్తే'లో ప్రచురితం కావడంతో అధికారులు 3రోజుల క్రితం ఎట్టకేలకు బీటీ వేశారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

### ఎమ్మెల్యే పాయం



కన్నాయిగూడెంలో సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కరకగూడెం, మే 24: మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. శనివారం మండలంలోని సమత్‌భట్టుపల్లి, భట్టుపల్లి, రేగళ్ల, కన్నాయిగూడెం పంచాయతీల్లో రూ. 70లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని, గ్రామాల్లో తాగునీరు సమస్య, పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందుతాయని వివరించారు. అనంతరం భట్టుపల్లిలో కస్తూర్బా గాంధీ డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలించి నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పోలెబోయిన శ్రీవాణి, తిరుపతయ్య, ఎర్ర సురేష్, జలగం కృష్ణ, భూక్యా రాందాస్, గొగ్గల రవి, అధికారులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### మణుగూరు సీఐగా నాగబాబు

మణుగూరు టౌన్, మే 24: వరంగల్ ఐజీ రేంజ్ పరిధిలో శనివారం రాత్రి పలువురు సీఐలకు బదిలీలు, పోస్టింగ్‌లు జరిగాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పనిచేస్తున్న ఇ.శ్రీనివాస్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎగ్జిస్టింగ్ వేకెన్సీలో నియమించారు. ఖాగజ్‌నగర్ ట్రాఫిక్ పీఎస్‌లో ఎస్‌హెచ్‌వోగా ఉన్న పాటి నాగబాబును మణుగూరు సీఐగా నియమించారు.

### వృద్ధాశ్రమంలో బియ్యం, పండ్లు పంపిణీ

అశ్వాపురం, మే 24: ఏడూళ్ల బయ్యారానికి చెందిన పొలిశెట్టి గణపతిరావు, వరలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని ఆరీఫా, రోషిణి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు 50 కిలోల బియ్యం, పాలు, పండ్లు వితరణగా అందజేసి ఔదార్యం చాటుకున్నారు.

### పాల్వంచలో నేడు విద్యుత్ అంతరాయం

పాల్వంచ, మే 24: పట్టణంలోని ప్రధాన సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ 1, 2 ఏఈలు మధు, ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్, మార్కెట్ ఏరియాల, బొల్లూరుగూడెం, కేఎస్పీ రోడ్, టీచర్స్ కాలనీ, కరకవాగు, పాత పాల్వంచ, నవభారత్, ఎర్రగుంట, అయ్యప్ప నగర్, శ్రీనివాస్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

అన్నపురెడ్డిపల్లి, మే 24: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం అందజేశారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### కల్వర్టు ప్రారంభం

టేకులపల్లి, మే 24: మండలం బొమ్మనపల్లి పంచాయతీ బొమ్మనపల్లి–శంభునిగూడెం బీటీ రోడ్డుపై నిర్మించిన కల్వర్టును ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం ప్రారంభించారు. గోలియతండా పంచాయతీలో సామ్యవాగుపై కల్వర్టుకు శంకుస్థాపన చేశారు. బేతంపూడి సొసైటీ కార్యాలయంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు.

### ఇంకుడు గుంతల పరిశీలన

దమ్మపేట, మే 24: మండలంలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని అడిషనల్ డీఆర్‌డీవో ఎన్.రవి శనివారం పరిశీలించారు. ఎంపీడీవో బీ.రవీంద్రారెడ్డి, ఎంపీవో రామారావు, ఏపీవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు, మే 24: పట్టణంలోని పలుచోట్ల నిర్మించిన ఇంకుడు గుంతలను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ శనివారం పరిశీలించారు. మేనేజర్ అంకుషావలి తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నత విద్యతో ఎన్నో అవకాశాలు

అశ్వారావుపేట, మే 24: వ్యవసాయ ఉన్నత విద్యతో ఎన్నో అవకాశాలు ఉన్నాయని స్థానిక వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థిని గ్రీష్మ చెప్పారు. పీజీ తదితర ప్రవేశ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సును ఎస్సీ, ఎస్టీ సెల్, జేఆర్ఎఫ్ సెల్ శనివారం సంయుక్తంగా నిర్వహించాయి. ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలను గ్రీష్మ వివరించారు. కళాశాల అసోసియేట్ డీన్. డాక్టర్ జె.హేమంత్ కుమార్, ఎస్సీ–ఎస్టీ సెల్ ఇన్‌చార్జ్ డాక్టర్ కోటేశ్వర్, డాక్టర్ శ్రావణ్ కుమార్, జేఆర్ఎఫ్ ఇన్‌చార్జ్ డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ ప్రాంగణంలో మరుగుదొడ్లకు శంకుస్థాపన

అశ్వారావుపేట, మే 24: మండలంలోని వినాయకపురం ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం మరుగుదొడ్లకు అడిషనల్ డీఆర్‌డీవో రవి శనివారం శంకుస్థాపన చేశారు. పీఆర్ ఏఈ అక్షిత, ఈజీఎస్ ఏపీవో రామచంద్రరావు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ శిక్షణ శిబిరం పరిశీలన

చండ్రుగొండ, మే 24: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరిశీలించారు. అయ్యన్నపాలెం రైతు వేదికలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇచ్చారు.

### ఆర్ఎంపీకి ఆర్థిక సాయం

ములకలపల్లి, మే 24: మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన ఆర్ఎంపీ అశోక్ (సాయిలు) ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు శనివారం పరామర్శించారు. వైద్య ఖర్చులకు రూ.5వేలు ఇచ్చారు.

### గిరిప్రసాద్‌కు నివాళి

పాల్వంచ, మే 24: సీపీఐ నేత నల్లమల గిరిప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఆ పార్టీ నాయకులు శనివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో నివాళులర్పించారు. ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, బండి నాగేశ్వరరావు, రాహుల్, పద్మజ, నాగరాజు పాల్గొన్నారు.

భద్రాచలం, మే 24: నల్లమల గిరిప్రసాద్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. శనివారం సీపీఐ కార్యాలయంలో నల్లమల గిరిప్రసాద్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత గిరిప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### పూర్వ విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

పాల్వంచ రూరల్, మే 24: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివి నిరుద్యోగులుగా ఉన్న వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు మండలంలోని లక్ష్మీదేవిపల్లి (ఎస్) సోషల్ వెల్ఫేర్ పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

### కార్మికుల సంక్షేమమే ముఖ్యం

కొత్తగూడెం సింగరేణి, మే 24: సింగరేణి సంస్థకు కార్మికులు, ఉద్యోగుల సంక్షేమమే ముఖ్యమని నూతన జీఎం (పర్సనల్ వెల్ఫేర్) సీఎస్ఆర్ కిరణ్ కుమార్ అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. వెల్ఫేర్ ఆఫీసర్‌గా సింగరేణిలో చేరి జీఎం స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. సంస్థ ఉద్యోగులు, కార్మికులకు మెరుగైన సేవలు అందేలా చూస్తానన్నారు.

### ఐక్య రైతు సంఘం ర్యాలీ

దమ్మపేట, మే 24: నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని, స్వామినాథ్ సిఫారసులను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం దమ్మపేటలో ర్యాలీ, బహిరంగ సభ జరిగాయి. గుమ్మడి నర్సయ్య, వి.ప్రభాకర్, బుర్ర వెంకన్న, చంద్ర అరుణ, ముద్దా భిక్షం, రవి పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

భద్రాచలం, మే 24: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు అర్చకులు శనివారం స్వర్ణతులసి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు.

## తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్

భద్రాచలం, మే 24: భద్రాచలం పట్టణంలో కూనవరం రోడ్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. భద్రాచలం డివిజన్‌లో తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా బాధితులు ఎక్కువగా ఉన్నారని తెలిసి రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎల్.కాంతారావు, రాజారెడ్డి, సూర్యనారాయణ, చంద్రప్రసాద్, రామకృష్ణ, మాదిరెడ్డి రమణారావు, తిప్పన సిద్ధులు, కోట దేవదానం, జగదీష్, పల్లంటి దేశప్ప, జీఎస్.శంకర్‌రావు, వెంకటరెడ్డి, భానుప్రసాద్, అలీంఖాన్, బీవీ.రమణారెడ్డి, మారుతి నర్సింగ్ పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న నాయకులు

మణుగూరు టౌన్, మే 24: మణుగూరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అద్దంకి నరేష్‌ను బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నాయకులు కుర్రి నాగేవ్వరరావు, కుంటా లక్ష్మణ్, ముద్దంగుల కృష్ణ, రాంబాబు, రామకోటి, రామారావు, వీరన్న, గుర్రం సృజన్, వేర్పుల సురేష్, జక్కం రంజిత్, గద్దల సాంబశివరావు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణా లారీ పట్టివేత



లారీలోని పశువులు

అశ్వాపురం, మే 24: లారీలో అక్రమంగా రవాణా చేస్తున్న 35 పశువులను ఎస్సై మధుప్రసాద్ తన సిబ్బందితో కలిసి గొల్లగూడెంలోని సీతారామ కెనాల్ సమీపంలో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అక్రమ పశువుల రవాణాను ఉపేక్షించబోమని ఎస్సై అన్నారు. లారీని స్వాధీనం చేసుకుని పశువులను పాల్వంచ గోశాలకు తరలించినట్లు తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ పట్ల హర్షం

మణుగూరు టౌన్, మే 24: బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ ప్రకటించడం హర్షనీయమని బీసీ సంఘాల నాయకులు పేర్కొనానరు. మణుగూరులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో శనివారం మండల కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం అభినందనియమని తెలిపారు. కార్యక్రమంలో బుర్ర సోమేశ్వర్ గౌడ్, వీరంకి వెంకట్రావ్ గౌడ్, నాగారపు సతీష్‌కుమార్, పెనుగొండ సాంబశివరావు, పొదిల వీరబాబు, కుమారస్వామి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమానికి చర్యలు అభినందనీయం



కృతజ్ఞతలు తెలుపుతున్న టీబీజీకేఎస్ నాయకులు

మణుగూరు టౌన్, మే 24: విధుల నిర్వహణలో రక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను మించి ఉత్పత్తి సాధిస్తూ ఏరియాను అగ్రపథంలో నిలబెడుతున్న ఏరియా జీఎం దుర్గం రాంచందర్ కార్మిక ఆదరాభిమానాలు చూరగొనడం అభినందనీయమని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. పీవీ కాలనీ ఏరియాలోని ఎంసీ క్వార్టర్స్‌కు పార్కింగ్ షెడ్డు కోసం రూ.1.27 కోట్లు వెచ్చించి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. సమావేశంలో ఇజ్రాయేల్, మునిగెల నాగేశ్వరరావు, రామాచారి, మస్తాన్, మురళికృష్ణ, పవన్‌కుమార్, ముకేష్, వినయ్‌కుమార్, నరేష్, రేవన్, ఇమ్రాన్, కల్యాణ్, శ్రీనివాస్, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో బాలుడు మృతి

ములకలపల్లి, మే 24: విద్యుదాఘాతంతో బాలుడు మృతిచెందాడు. స్థానికులు, కటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... మండలంలోని వీకే రామవరం గ్రామానికి చెందిన కొర్సా అరవింద్(13), శనివారం సాయంత్రం తన అండర్‌వేర్‌ను దండెం తీగపై వేస్తున్నాడు. అప్పటికే ఈ తీగకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో షాక్ తగిలి అరవింద్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ బాలుడి తండ్రి గతంలోనే గతించారు. తల్లి పద్మ మాత్రమే ఉంది. ఆమె గుండలవిసేలా రోదించింది. ఆమె ఫిర్యాదుతో ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేశారు.

## విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

అశ్వారావుపేట, మే 24: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. పట్టణంలోని మెరుపు కాలనీ నివాసి కోరుకొండ రాజమ్మ, తన మూడు గేదెలను శనివారం మేతకు తీసుకెళ్లింది. మార్గమధ్యలో పేపర్ బోర్డ్ ఫ్యాక్టరీ సమీపంలోగల విద్యుత్ స్థంభం వద్దకు వెళ్లిన ఒక పాడి గేదె.. విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. దీని విలువ ఖరీలు రూ.90 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపింది.

## గుడుంబా, నల్ల బెల్లం పట్టివేత

టేకులపల్లి, మే 24: గుడుంబాను, నల్ల బెల్లాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై సీహెచ్ శ్రీహరిరావు తెలిపిన వివరాలు.. మండలంలోని చింతలంక పంచాయతీ చింతలంకతండా గ్రామంలో బానోత్ రమేష్, నునావత్ శంకర్ నుంచి రెండు లీటర్ల నాటు సారా (గుడుంబా), 30 కేజీల నల్ల బెల్లం, రెండు కేజీల పటిక, బైక్‌ను పోలీసులు శనివారం స్వాధీనపర్చుకున్నారు. 20 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. ఆ ఇద్దరిపై ఎస్సై శ్రీహరిరావు కేసు నమోదు చేశారు.

## ముగిసిన శిక్షణ తరగతులు

దమ్మపేట, మే 24: మండలంలోని పట్వారిగూడెం జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. జూన్ 6 నుంచి ప్రారంభమయ్యే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి అధికసంఖ్యలో విద్యార్థుల నమోదుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో లక్ష్మి కోరారు. ఎంఆర్పీలు బేతి రామకృష్ణ, జారే ప్రభాకర్, వీ.షారోనికుమారి, వీ.రాంబాబు, కే.రవి, టీ.కృష్ణ, బీ.రాంసాగర్, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎంఈవో, ఉపాధ్యాయులు